# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



శుక్రవారం 04 జూలై 2025


## స్వగ్రామంలో మంత్రి ప్రజాదర్బార్

**చిన్నమండెం, జూలై 03 ప్రబాతవార్త :**

మండలంలోని బోడిరెడ్డిగారిపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. పలు అభివృద్ధి పనులపై అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



## డాన్స్‌కు అడ్డుగా ఉందని

# బిడ్డను చంపిన తల్లి, ప్రియుడికి జీవిత ఖైదు

**మదనపల్లి క్రైమ్, జూలై 3 ప్రభాతవార్త.**

డాన్స్ ప్రోగ్రామ్ కు అడ్డుగా ఉన్న బిడ్డను తన ప్రియుడితో కలసి చంపిన తల్లి, ఆమె ప్రియుడికి మదనపల్లి ఏడిజె కోర్టు జడ్జి జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు ను ఇచ్చారు. ఏపీపి జయనారాయణ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఐరాల మండలం, మొరవపల్లికి చెందిన బోయకొండ భార్య శాంత (30) రామసముద్రం మండలం, గాజులనగరంకు చెందిన ఆమె ప్రియుడు సుండుపల్లి శ్రీనివాసులు (34)లు 2017 వ సంవత్సరంలో పుంగనూరు మండలం, సుగాలిమిట్ట పెద్దతండాలో డాన్స్ ప్రోగ్రాంకు వెళ్లారు. ఆ సమయంలో వారిద్దరికీ కుమార్తె శివాని (2) అడ్డుగా ఉందని భావించి శాంత, శ్రీనివాసులు ఇద్దరూ సుగాలిమిట్ట వద్ద గొంతునులిమి హత్య చేశారు. అనంతరం శవాన్ని ఆటోలో తీసుకొచ్చి మదనపల్లె మండలం, చెంబాకూరు రోడ్డు సందిరెడ్డిపల్లి కాలువలో పడేసారు. ఈ కేసులో అప్పటి పుంగనూరు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. కేసు విచారణ పూర్తి కావడంతో వారిద్దరినీ ముద్దాయిలుగా భావించి మదనపల్లి ఏడిజే కోర్టు న్యాయమూర్తి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు చెప్పారు. అలాగే ఐదు వేలు అపరాధం విధించారు.



# రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదుల భార్యలు అరెస్టు







**రాయచోటి జూలై 03 ప్రభాతవార్త**

2025 జూన్ 30న తమిళనాడు పోలీసులు పలు బాంబు పేలుళ్ల కేసుల్లో నిందితులపై జారీ చేసిన అరెస్ట్ వారెంట్లను అమలు చేశారు. ఈ నిందితులు 1999 నుండి పరారీలో ఉండగా, వారు గత 20 సం. గా రాయచోటి పట్టణంలో తప్పుడు పేర్లతో (అబూ బకర్ సిద్ధిక్ – అమానుల్లా పేరుతో, మహమ్మద్ అలీ – మంసూర్ పేరుతో) నివసిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందిన తర్వాత, అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా పోలీసులు తక్షణమే స్పందించి, రాయచోటిలోని కొత్తపల్లి మరియు మహబూబ్ బాషా వీధిలో ఉన్న నిందితుల ఇళ్లను చట్టపరమైన విధానాల ప్రకారం శోధించారు. ఈ గృహశోధనలో భారీ మొత్తంలో విస్ఫోటక పదార్థాలు లభించాయి, వీటిని ఉపయోగించి పేలుడు పరికరాలు (ఐఇడీ) తయారు చేయవచ్చును. అని ఈ పదార్థాలు భారతదేశ పౌరుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదాన్ని కలిగించే స్థాయిలో ఉన్నాయి. ఈ శోధనతో దేశ స్థాయిలో ప్రమాదం నివారించబడింది. అబూ బకర్ సిద్ధిక్ అమానుల్లా మరియు మహమ్మద్ అలీ మంసూర్ అనే ఉగ్రవాదుల కార్యకలాపాలకు సంబంధించి ఈ సామగ్రిని పోలీస్ బృందం స్వాధీనం చేసుకుంది. వీరు "అల్ ఉమ్మా" అనే తీవ్రవాద సంస్థతో అనుబంధం కలిగినవారిగా గుర్తించబడ్డారు.

### స్వాధీనం చేసుకున్న వస్తువులు...

ఫ్యూయల్ ఆయిల్‌తో కలిపిన అమ్మోనియం నైట్రేట్ – ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్, స్లర్రీ ఎక్స్‌ప్లోసివ్ – (నైట్రో గ్లిసరిన్ అయ్యి ఉండవచ్చు)PETN తో నిండి ఉండే బాంబు – 20 కేజీల suitcase లో మరొక suitcase – IED అయ్యి ఉండవచ్చు,ఒక బాక్స్ – IEDఅయ్యి ఉండవచ్చు, పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరేట్, పొటాషియం పెర్మాంగనేట్, గన్ పౌడర్, డ్యాగర్ (పిచి కత్తి), కొడవళ్లు, పించిన ఆయుధాలు, టైమర్‌ల కోసం గడియార యంత్రాలు, పుల్ స్విచ్‌లు, ప్రెషర్ స్విచ్‌లు, స్పీడ్ కంట్రోలర్లు, గ్యాస్ ట్యూబ్ అరెస్టర్లు, పేలుళ్ల సమయంలో గాయాలకు ఉపయోగించే బాల్ బెరింగ్స్, నట్‌బోల్ట్లు, మానిటరింగ్ కోసం బైనాక్యులర్స్, వాకీటాకీలు, రేడియో పరికరాలు, అనేక మొబైల్ ఫోన్లు, అనేక చెక్ పుస్తకాలు, ఆర్థిక లావాదేవీల సమాచారం, డిజిటల్ స్టోరేజ్ పరికరాలు, ముస్లిం సాహిత్యం, భారతదేశంలోని నగరాల మ్యాపులు, టైమింగ్ సర్క్యూట్ల మాన్యువల్స్, కోడింగ్ బుక్, ఆస్తి మరియు ప్రయాణ పత్రాలు, హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, ఈ ఇంటి శోధన సందర్భంగా, నిందితుల భార్యలు అయిన సైరా భాను (అబూ బకర్ సిద్ధిక్ భార్య) మరియు షేక్ షమీం (మహమ్మద్ అలీ భార్యలు) పోలీసులపై ప్రతిఘటన చేశారో కాకుండా మహిళా పోలీసులపై దాడికి యత్నించారు. పోలీసుల నిరంతర శ్రమతో ఇంటిని శోధించి పై విస్ఫోటక సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేయబడ్డాయి:

Cr.No.363/2025 - Sec.132 BNS, Explosives Substance Act-1908 Sec.4,5, Explosives Act 1884 Sec.9(B), UAPA Act-1967 Sec.13,15,18, Arms Act 1959 Sec.3, 25(a), 25(1-B)(a) Cr.No.364/2025 - Sec.132 BNS, Explosives Substance Act Sec.6, UAPA Act-1967 Sec.13,15,18 సైరా భాను మరియు షమీం లను శోధనకు అడ్డుపడినందుకు మరియు మహిళా పోలీసులపై దాడికి ప్రయత్నించినందుకు అరెస్ట్ చేసి కడప సెంట్రల్ జైలుకు రిమాండ్ కి పంపారు. వీరికి నిందితుల ఉగ్రచర్యలపై ఎంత సంబంధముందో అనే దానిపై దర్యాప్తు కొనసాగుతుంది.

### నిందితులపై గతంలో నమోదైన కేసులు:

అబూ బకర్ సిద్ధిక్ (A-18): నాగూర్ PS Cr.No.637/1995 Ð IPC 302, 120(B), Explosives Act Sec.3, 4 మైలాడు PS Cr.No.1297/1995 – పై కేసుతో కలిపారు. చెన్నై చింతాద్రిపేట PS Cr.No.581/1995 Ð 120(B), 302 IPC, Explosives Act, TNPPDL Act మదురై తిరుమంగళం PS Cr.No.237/2011 – విస్తృతంగా ఉగ్రవాద, పేలుడు చట్టాలు వేలూరు CBCID Cr.No.1/2013 – సామూహిక దాడులు, ఉగ్రవాద చట్టాల ప్రకారం కేసులు.

మహమ్మద్ అలీ మంసూర్ (A-19):

చెన్నై ఎగ్మోర్ PS Cr.No.1018/1999 – బాంబు అమరిక, పాంప్లెట్‌లతో కలిసి పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద బాంబు ఉంచడంఈ కేసులు జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగించే ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించినవిగా నమోదయ్యాయి. ఎగ్మోర్ ఘటన రోజు అనేక ఇతర బాంబులు కూడా వివిధ ప్రాంతాలలో (చెన్నై, త్రిచ్చి, కోయంబత్తూరు) పగులగొట్టబడ్డాయి.1999లో కోచిన్‌కుర్లా ఎక్స్‌ప్రెస్‌లో ఈ నిందితులు పేలుడు పదార్థాలను అక్రమంగా తరలించబోతుండగా, ఆ ట్రైన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. అవి కాసర్‌గోడ్ వద్ద స్వాధీనం చేసుకున్నారు.ఈ ఇద్దరు నిందితులు గత 20 సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో తప్పుడు గుర్తింపులతో నివసిస్తూ, స్థానికంగా వివాహాలు చేసుకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. అన్నమయ్య జిల్లా పోలీసుల చొరవతో ఒక పెద్ద ఉగ్ర కుట్రను భగ్నం చేయడంలో విజయం సాధించారు.

### ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన బృందం:..

రాజంపేట, మదనపల్లి, రాయచోటి సబ్ డివిజన్ పోలీసు అధికారులు. ఎస్బి సీఐ,సీఐ రాయచోటి అర్బన్ రాయచోటి రూరల్ సీఐ. సీఐ సైబర్ సెల్.ఆర్ఐ సైబర్ సెల్.స్పెషల్ బ్రాంచ్ సీసీఎస్ సిబ్బంది ఇంకా ఇతర సహచర నిందితుల వివరాలు గుర్తించే పనిలో ఉన్నారు.

## విద్యార్థినిలకు చేతులు వడతిప్పిన తాగుబోతు

### పిల్లలకు హాస్పిటల్ లో చికిత్స



**చిన్నమండెం జూలై 3 ప్రబాత వార్త:**

మండలంలోని బోనమల స్కూల్లో గురువారం సాయంత్రం టీచర్ బయటకు వెళ్లిన సమయంలో ఒతాగుబోతు స్కూల్లో చొరబడి పిల్లలను కొట్టి చేతులు వడతిప్పి నట్లు పిల్లలు హాస్పిటల్లో చెప్పారు. తాగుబోతు నుంచి తప్పించుకుని ఆ పసి పిల్లలు దగ్గర్లో ఉండే గవర్నమెంట్ హాస్పిటల్ కు వెళ్లారు. టీచర్ క్లాసులో లేనిది చూసి తమను ఓ తాగుబోతు చేతులు వడతిప్పాడని ఆ పిల్లలు ఆరోపిస్తున్నారు. ఇంత జరిగినా ఉపాధ్యాయుడు ఆసుపత్రి వైపు రాకపోవడంతో పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పెరుగుతున్న టమోటా ధరలు

**మదనపల్లె, జులై 3 ప్రభాతవార్త :**

టమోటా ధరలు గత వారం రోజులుగా పెరుగుతుండడంతో రైతులు ఆనందోత్సవాల్లో ఉంటున్నారు. గురువారం మార్కెట్‌యార్డులో మొదటి రకం పదికిలోల టమోటా బాక్స్ రూ. 400నుంచి 430ల వరకు ధర పలికింది. కిలో టమోటా రూ. 43లు ధర పలకడం జరిగింది. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టపోయిన రైతాంగానికి ఈ ధరలతో ఊరట చెందుతున్నారు. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ పెరగడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా వ్యాపార లావాదేవీలకు మదనపల్లె మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే పేరుపొందింది. ఇక్కడ టమోటాను రైతులు ఏడాది పొడవునా జీవనాధారపంటగా సాగు చేస్తారు. మదనపల్లె మార్కెట్‌యార్డు నుంచి టమోటాలు తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక, తెలంగాణ, మహరాష్ట్ర, కేరళ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతాయి. మార్కెట్‌యార్డులో టమోటా వ్యాపార లావాదేవీల్లో వేలాదిమంది కూలీలు జీవనం పొందుతారు. మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెక్రటరీ జగదీష్ పలు సౌకర్యాలు కల్పించారు. ముఖ్యంగా తాగునీటిసౌకర్యం, ప్రత్యేకమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణకు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బందితో చర్యలు తీసుకొంటున్నారు.






## ప్రజలకు ఇంకా ఏం చేయాలో తెలుసుకునేందుకే

# సుపరిపాలనలో తొలి అడుగు

**రాజంపేట, జూలై 3 ప్రభాతవార్త**

నిరంతరం ప్రజల కోసం పరిశీలించే ప్రజా నాయకుడు చంద్రబాబు నాయుడు అని, అరాచక జగన్ ప్రభుత్వాన్ని గద్ద దింపేందుకు సంపూర్ణం మెజారిటీ ఇచ్చినా ఇంకా ప్రజలకు ఏమి చేయాలో తెలుసుకునే అందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టినట్లు టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. ప్రజల సంక్షేమం కూటమి ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని అంకితభావంతో పనిచేస్తుందన్నారు. మరింతగా మెరుగైన పరిపాలన ప్రజలకు అందించేందుకే ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వస్తున్నట్లు తెలిపారు. గురువారం దిగువ బసినాయుడు గారి పల్లెలో ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. మహిళ సమస్యలను విన్నారు. ప్రభుత్వం నుండి అందుతున్న పథకాల గురించి,భవిష్యత్ లో చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి,అలాగే రాష్ట్రం లో జరుతున్న అభివృద్ధి గురించి ప్రజలకి వివరిస్తూ,వారి అభిప్రాయాలను సేకరించారు.అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ టిడిపి అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, మాజీ టిడిపి అధ్యక్షుడు బాపనయ్య నాయుడు, బాసినేని వెంకటేశ్వర నాయుడు సంజీవరావు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, దొంతం శివప్రసాద్, సుబ్రహ్మణ్యం నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి, ఉపాధ్యక్షుడు సతీష్ రాజు, మాజీ సర్పంచ్ మల్లికార్జున్ నాయుడు, పోలి చెరువు నీటి సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్ నాయుడు, మేడి కొండు రవికుమార్ నాయుడు, దివాకర్ నాయుడు, రమేష్ బాబు, నాగినేని నవీన్, మేడి కొండు వెంకటేశ్వర్లు, సురేంద్ర, ముళ్ళగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, డాక్టర్ నవీన్, ఎక్స్ ఎంపీటీసీ గుడారు సుబ్రహ్మణ్యం నాయుడు, బూత్ కన్వీనర్ నాగినేని శంకర్, ఊటుకూరు చెంగల్ రాయుడు, వెంకట్ స్వామి, టెక్సమో మల్లికార్జున నాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వర్ల నాయుడు, పరుశురాం నాయుడు, కొల్లపనేని వెంకటేశ్వర్లు, వరదయ్య గారి పల్లి సర్పంచ్ హరి, సతీష్, కళాధర్, వాణి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ప్రయాణం

**పీలేరు జూలై 3 ప్రభాతవార్త :**

పీలేరు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు 1500 రూపాయలు దాంతోపాటు ఆగస్టు 15 నుండి ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నట్లు పీలేరు పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ మల్లెల రెడ్డి భాష అన్నారు. పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు కేజీఎన్ రెడ్డి భాష నేతృత్వంలో "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమాన్ని రెండో రోజు నిర్వహించారు. వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు తమకు చేరుతున్నాయా అంటూ ప్రజలకు అడిగి తెలుసుకుంటూ ఇక మీదట కూడా ప్రవేశపెట్టనున్న పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచుతూ వారికున్న సమస్యలు కూడా తెలుసుకొని అధికారులు దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతయ్య, బషీర్, సురేష్, అమీరుల్లా, మల్లి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో తెదేపా నాయకులు

## మొదలైన మొహరం వేడుకలు

**దువ్వూరు, జూలై 03, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరు, చిన్న సింగనపల్లె,ఎర్రబల్లె, తదితర గ్రామాల్లో మొహరం వేడుకలు మొదలయ్యాయి. వేడుకల్లో భాగంగా 7వ రోజు మండల కేంద్రమైన దువ్వూరులో బంగారు పీరు అగ్ని గుండంలో దిగి అక్కడి నుంచి దువ్వూరు పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సంధర్భంగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్దలతో బంగారు పీరు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం మొహరం పండుగ సంధర్భంగా మండల కేంద్రమైన దువ్వూరులో ఎక్కువ సంఖ్యలో పీర్లు ఊరేగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.







# ధరలు లేక కుదేలైన మామిడి రైతులు



**లక్కిరెడ్డిపల్లె; జులై 03, ప్రభాతవార్త**

రెండేళ్లుగా వర్షాలు లేక రైతులు సేద్యంపై ఆసక్తి చూపడం లేదని వైఎస్ఆర్సిపి రాసి వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు గురువారం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో స్థానిక ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితో పాటు మండలంలోని రైతులతో కలిసి మాట్లాడారు మొశల,ఆరుద్ర కార్తులు వెళ్లిపోయి రెండు రోజుల్లో పెద్దపుష్యాల కార్తె రానున్నడంతో రైతులు అదును లో పంటలు సాగు చేసుకోవడం కోరకు పదును పాటి వర్షం కోసం ఎదురుచూస్తూ ఉన్నారని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పూర్తిగా వర్షాభావం ఏర్పడడంతో రైతులు పంట సాగు పై పెట్టుబడులు పెట్టడానికి కూడా వెనకాదుతున్న పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని ఆయన అన్నారు. గత దశాబ్ద కాలంనుండి పోలిస్తే ఈ రెండేళ్లతో పాటు ఈ ఏడాది కూడా వర్షాలు ముఖం చాటేయడంతో 40 శాతం పైబడి రైతులు సాగు చేయడంపై మక్కువ చూపు లేక వెనకాదుతున్నారన్నారు. ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో తిండి గింజలు కూడా లేని దుర్భిక్ష పరిస్థితులు దాపురించే అవకాశాలు లేకపోలేవన్నారు.దోస, కర్బూజా, టమోటా, మామిడి ఇలా పండ్ల తోటలపై ఆశలు పెట్టుకున్న రైతులు ఈ రెండు, మూడేళ్లలో మునుపెన్నడూ లేని విధంగా మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక తోటల్లోనే వదిలేయడంతో రైతులు పూర్తిగా నష్టాలబాటలో పడ్డారన్నారు. మామిడి రైతుల దయనీయ పరిస్థితి చూస్తుంటే చలించిపోయామని అన్నారు. మామిడి సాగు చరిత్రలో ఇంత అద్వాన్న పరిస్థితులు చూడలేదని నియోజకవర్గంలోని రైతులు తన ఎదుట వాపోయారన్నారు. వేరుశనగ పంట సాగు ప్రస్తుతం ఎక్కడ కూడా ఆనవాళ్లు కనిపించే పరిస్థితి లేని రోజులు చూస్తున్నామంటే రైతన్న పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో ఇట్టే అర్థమవుతుందన్నారు. వరి నారుకు కూడా బోరు, బావుల్లో నీళ్ల లేని పరిస్థితికి కరువు ఛాయలు అలుముకున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రైతులపై దృష్టి సారించి రైతులకు వడ్డీ లేని వ్యవసాయ రుణాలతో పాటు , మామిడి రైతుకు నష్టపరిహారం రూపంలో చేయూతను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప మండల అధ్యక్షులు సమరసింహారెడ్డి, సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ రాజారెడ్డి, మైనార్టీ నాయకులు అలీ షేర్, సాహెబ్, జాకీర్, బాబ్జాన్, ఖదీర్, వైఎస్ఆర్సిపి నాయకులు లక్ష్మిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మోహన్ కుమార్, నాగేషా రెడ్డి, పలువురు మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రభుత్వం సల్లగా ఉండాలి



**తంబళ్లపల్లె జూలై 3 ప్రభాతవార్త ః**

గతంలో ఎప్పుడు రంపులు, రాగింతాలు, ఓటేసే పనిలే, బయటకు రావాలంటే భయం ఇప్పుడు చంద్రబాబు నాయుడు పాలనలో మా బిడ్డలకు డబ్బుతో పాటు గ్యాస్, లోన్లు అన్ని వస్తున్నాయి చంద్రబాబు ప్రభుత్వం సల్లగా ఉండాలి నాయనా అంటూ జయచంద్రారెడ్డిని దీవించడం హర్షనీయం. గురువారం ములకలచెరువులో సుపరి పాలనలో మొదటి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమం జయచంద్ర రెడ్డి నాయకత్వంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు పలుచోట్ల మహిళలు పై విధంగా స్పందిస్తూ మా కోసం కష్టపడుతున్నావు. నీ కష్టం వృధా కాదు ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా మా ఓటు తెలుగుదేశానికేనని ఘంటాపతంగా చెప్పడం తో నాయకులు, ప్రజలు చంద్రబాబు, జయచంద్ర రెడ్డి నాయకత్వాలు వర్ధిల్లాలి నినాదాలతో హోరెత్తించారు.

## తంబళ్లపల్లె పరిశీలకులకు ఘన సన్మానం.



**తంబళ్లపల్లె జూలై 3 ప్రభాతవార్త ః**

రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దినేష్ రెడ్డి,తంబళ్లపల్లె నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి, తంబళ్లపల్లె మండల ఎన్నికల పరిశీలకుడు రెడ్డప్పను పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి బాట పట్టిస్తున్న జయచంద్రారెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ప్రతి గ్రామంలో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో కమిటీ ఎన్నికలు ఏకగ్రీవాలు కావడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఎన్నికల పరిశీలకులు సైతం క్షేత్రస్థాయిలో కమిటీ ఎన్నికల నిర్వహణతో ప్రతి కార్యకర్త తమ మనోభావాలను చెప్పుకొని అవకాశం కలగడం హర్షనీయమన్నారు. జయచంద్రారెడ్డి నాయకత్వంలో నేడు జరుగుతున్న సుపరిపాలనకు మొదటి మెట్టు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తున్న తీరు ఆయన చేస్తున్న సేవకు దర్పణమని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాజంపేట బీసీ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, బీసీ నేత మీసాల భాస్కర్ నాయుడు, యువనేత జగదీష్, రైతు నాయకుడు జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓను ఘనంగా సన్మానించిన నాయకులు



**నిమ్మనపల్లె, జులై 3 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె ఎంపిడిఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌కు గురువారం మండల టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గజ మాలతో, శాలువకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి మండల అధ్యక్షులు రాజన్న, మాజీ ఎంపిపి రామక్రిష్ణ, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.మల్లికార్జున, బాహుదా చైర్మెన్ దేవేందర్‌రెడ్డి, తవళం సర్పంచ్ రెడ్డప్ప, మాజీ సర్పంజ్ రఫీ, ప్రభుత్వ ఆసుపత్రి మాజీ చైర్మెన్ పతి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, రఫి, ఖాసీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తున్నాం

**పులివెందుల,జులై 3,ప్రభాత వార్త:**

కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం అని పులివెందుల నియోజక వర్గ ఇంచార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట పరిసర వీదుల్లో పార్టీ శ్రేణులతో కలిసి బీటెక్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి బూతు ఇన్చార్జిలతో మైటిడిపి యాప్‌లో ఆ కుటుంబాల వివరాలు నమోదు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని అయినా కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోని తమ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని ప్రతి విద్యార్థి తల్లులు ఖాతాల్లో ఒక్కో విద్యార్థికి 13000 రూపాయలు జమచేశారన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో వృద్ధులు వితంతువులకు నెలకు 4000 రూపాయలు, దివ్యాంగులకు 6000 రూపాయలు ఇవ్వడం జరుగుతోంది అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రానికి పలు బహుళ జాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేశారని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఆయా బూత్ ఇన్చార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జీలు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నిమ్మనపల్లె కళాశాలలో హెల్త్ చెకప్



పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**నిమ్మనపల్లె, జులై 3 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె పిహెచ్‌సిలో డాక్టర్ ప్రత్యూస్, వాల్మీకిపురం పిహెచ్‌సి డెంటల్ డాక్టర్ ఎంపి హిమబిందుల సహకారంతో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం హెల్త్ చెకప్ చేశారు. ఇందులో భాగంగా 150మంది విద్యార్థులకు రక్తనమూనాలు, బ్లెడ్‌గ్రూప్, డెంటల్, జ్వరం వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రామాంజులు, అధ్యాపకులు, ల్యాబ్ టెక్నీషియన్స్ ఆనంద్, దేవేంద్రకుమార్, నిత్యమీనాక్షి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## బాలినాయునిపల్లెలో సైబర్ నేరాలపై అవగాహన



**నిమ్మనపల్లె, జులై 3 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలంలోని బాలినాయునిపల్లెలో గురువారం నిమ్మనపల్లె ఎస్ఐ, సిబ్బంది పాలు గ్రామాల్లో సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ద్విచక్రవాహనాలు అన్ని రికార్డులుకలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్‌లు, రాత్రిపూట అసాంఘీక కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. అనుమానితులు ఎవరైనా గ్రామాల్లో కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

## అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం

**మదనపల్లి క్రైమ్ జులై 3 ప్రభాతవార్త.**



మదనపల్లి పట్టణంలో అధిక వడ్డీలు తీసుకుంటూ అమాయక ప్రజలను పట్టిపీడిస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు చేపడతామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా హెచ్చరించారు. బుధవారం వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న బొజ్జ రాజేంద్ర అలియాస్ కోళ్ల రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లి పట్టణంలో అధిక వడ్డీలతో పేద ప్రజల ఆస్తులను, ప్రాణాలను బలిగుంటున్న వారి పైన క్రిమినల్ కేసులు తప్పవన్నారు. రెండు రూపాయల కంటే ఎక్కువ వడ్డీ తీసుకుంటున్న వారి గురించి బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. మదనపల్లి పట్టణంలో కాల్ మనీ కేసులు ఎక్కువ అవుతున్నాయని, పోలీసులు వీటి పైన ప్రత్యేక శ్రద్ధ వహించలన్నారు. అధిక వడ్డీలకు వ్యాపారం చేస్తున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి, వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పులి శ్రీనివాసులు, నాగమణి, మృతుని బంధువులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టణంలో భారీ దొంగతనం

**మైదుకూరు, జులై 03, ప్రభాతవార్త:**

మున్సిపాలిటీలోని సర్వేపల్లి రోడ్డు నందు గురువారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. పట్టణంలోని 11 వ వార్డు పరిధిలో సర్వాయిపల్లి రోడ్డులో ములపాకు జంగం రెడ్డి చిన్న సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో ఈ చోరీ జరిగింది. పట్టణంలోని వేదవ్యాస స్కూల్ సమీపంలో ఉన్న చిన్న సుబ్బారెడ్డి ఇంట్లోకి చొరబడి తలుపులను పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న బీరువా తలుపులు పగలగొట్టి అందులో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, పదివేల రూపాయల నగదును దోచుకున్నారు. చోరీ జరిగిన సమయంలో చిన్న సుబ్బారెడ్డి ఆయన భార్య మునెమ్మ ఇంట్లో లేరు మునెమ్మ వరి నాటుకు వెళ్లగా చిన్న సుబ్బారెడ్డి పసుపు పంటకు నీరు పెట్టడానికి వెళ్ళాడు.అదును చూసి దుండగులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటికి చేరుకున్న దంపతులు తలుపులు పగలగొట్టి ఉండడం చూసి లబోదిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు.ఇంట్లో ఉన్న బీరువా ఇతర వస్తువులపై వేలిముద్రలను సేకరించారు. సంఘటనపై మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గాలివీడు మండల వైసీపీ ఆర్‌టీఐ విభాగ అధ్యక్షునిగా బండి అనిల్‌కుమార్‌రెడ్డి

**గాలివీడు, జులై 3(ప్రభాతవార్త):**



గాలివీడు మండల వైఎస్ఆర్‌సీపీ ఆర్‌టీఐ విభాగ అధ్యక్షుడిగా గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన బండి అనిల్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ నియామకానికి సహకరించిన జిల్లా సుదర్శన్‌రెడ్డి, యదుభూషణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యంకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా బండి అనిలకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి ప్రజలకు న్యాయం చేయడం, ప్రభుత్వ విధానాలలో పారదర్శకతను తీసుకురావడం నా ప్రధాన లక్ష్యం అని తెలిపారు.

## వాట్సప్ గ్రూపులపై నిఘా

**సిద్ధవటం జులై 3 ప్రభాతవార్త**

కొన్ని ప్రెస్ గ్రూపులు ఏర్పరచుకొని ఇతరులకు ఇబ్బంది పెట్టే విధంగా పోస్టింగులు పెట్టే గ్రూపులపై నిఘా ఏర్పాటు చేస్తామని సిద్ధవటం మండల ఎస్సై మహమ్మద్ రఫీ పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం మాట్లాడుతూ,కొంతమంది విలేకరులు అని చెప్పుకుంటూ టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలపై ప్రెస్ స్టిక్కర్ ఏర్పాటు చేసుకున్న వాహనాలను తనిఖీలు చేపడతామని మీడియాలో పనిచేసే విలేకరులకు ఆ సంస్థలు గుర్తింపు కార్డులు అందజేస్తాయని కార్డు ఆధారంగా ప్రెస్ స్టిక్కర్ ఏర్పాటు చేసుకోవాలని అలా కాకుండా పనిచేయకుండా స్టిక్కర్లు పెట్టుకోవడం నేరమన్నారు. కొన్ని వాట్సాప్ గ్రూపులలో అనవసరమైన కామెంట్లు, మరియు కొన్ని అసభ్యపదజాలలతో మెసేజ్లు పెడుతున్నారని వాటిపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

## అల్లూరి జయంతి వేడుకలను విజయవంతం చేయండి

**రామసముద్రం జులై 3 ప్రభాతవార్త**

మన్నెం వీరుడు, స్వతంత్ర సమరయోధుడు, బ్రిటిష్ వాళ్లని మూడు చెరువుల నీళ్లు తాగించిన, ధైర్యశాలి, ప్రజ్ఞానవంతుడు, స్వతంత్ర ఉద్యమంలో, ఆయన తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా, పెట్టి బ్రిటిష్ ప్రభుత్వానికి, నిద్రలేని రాత్రులను, చూపిన, వీరుడు, అయిన అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా రామసముద్రం మండలం బైరాజు పల్లె, నల్లచిన్నెపల్లె, మానేవారిపల్లె, రాజగుండ్ల పల్లెలో ఘనంగా నిర్వహిస్తామని క్షత్రియ సంఘం సభ్యులు తెలిపారు. అలాగే పుంగనూరులో 04వతేది శుక్రవారం ఉదయం 11:30 కి పుంగనూరు గోకుల్ సర్కిల్ నందు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో గోకుల్ సర్కిల్ వద్ద, అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించే కార్యక్రమం కలదు. కావున ప్రజలందరూ పార్టీలకతీతంగా, కులాలకు అతీతంగా, మతాలకతీతంగా హాజరై ఆ మహనుభావుడికి నివాళులర్పించాలని కోరారు.

## నిషేధిత వస్తువుల రవాణాపై సమాచారం ఇవ్వాలి



**పీలేరు జూలై 3 ప్రభాతవార్త :**

నిషేధిత వస్తువుల రవాణాపై ట్రాన్స్ఫోర్ట్ కార్యాలయాల సిబ్బంది సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ సి.హెచ్. సుబ్బారెడ్డి అన్నారు. ఎక్సైజ్ కమీషనర్ ఆదేశాల మేరకు గురువారం పీలేరు పట్టణంలోని పలు ట్రాన్స్ఫోర్ట్ కార్యాలను తనిఖీ చేసి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా చేసే ఏ వస్తువు ఉంటే ఆ వస్తువు వేబిల్లులో ఉండాలని తెలిపారు. ఏదైనా తేడా ఉన్నా, మత్తు పదార్థాలు లాంటి, ఖాళీ బాటిల్లు, మూతలు లాంటివి రవాణా జరిగినా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది రత్నం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌గా ధనుంజయలు

**పీలేరు జూలై 3 ప్రభాతవార్త :**



పీలేరు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జి. ధనుంజయలు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న సుబ్బమ్మ బదిలీపై జమ్మలమడుగు డిపోకు బదిలీ అయ్యారు. రాయచోటి డిపోలో సీఐగా పని చేస్తున్న ధనుంజయలు బదిలీపై పీలేరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్ల నాయకులు ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు.

## దీర్ఘ కాలిక వ్యాధులపై పారదర్శక సర్వే

**పీలేరు జూలై 3 ప్రభాతవార్త:**




గ్రామాల్లో దీర్ఘ కాలిక వ్యాధులపై పారదర్శకంగా సర్వే నిర్వహించాలని కడప రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని దొడ్డిపల్లె విలేజ్ క్లినిక్ ను తనిఖీ చేశారు. ఎన్సీడీ 3.0 సర్వేపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక సంక్రమణ వ్యాధులైన రక్తపోటు, మధుషుగర్, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులను గుర్తించాలని ఆదేశించారు. వ్యాధిగ్రస్తులతో సంబంధిత వ్యాధుల పట్ల ఉన్న అవగాహన గూర్చి నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్రెడ్డి, డాక్టర్ రాధా మాధవి, డాక్టర్ పి. సుబ్రమణ్యం, ఎన్సీడీ విభాగం లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమల ట్రస్ట్ వారి సేవలు అభినందనీయం

**బద్వేలు అర్బన్, జూలై 3, ప్రభాతవార్త**



దశాబ్దానికి పైగా ట్రస్ట్ సేవలు కొనసాగించడం ఎంతో విశేషమని మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు అన్నారు. గురువారం లక్ష్మీపాళెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తిరుమల ట్రస్ట్ బెంగళూరు వారిచే ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తిరుమల ట్రస్ట్ వారూ విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేసి గొప్ప మనసుతో సేవలను అందించడం అభినందన దగ్గర విషయమని ప్రశంసించారు. అన్ని దానాలలో కల్లా విద్యాదానం ఎంతో గొప్పదని, తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత విద్య అభ్యసించామని ,ఏదైనా సాధించాలంటే పట్టుదల ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. గతంలో తమకు ఇన్ని సౌకర్యాలు లేవని ఇప్పటి విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించడం తోపాటు ఇలాంటి స్వచ్ఛంద సేవా సంస్థల వారు తమ సహకారం అందిస్తుండటం ఎంతో అభినందనీయమని వారి సేవల గురించి ఎంత చెప్పినా తక్కువేనని తెలియజేశారు. గత 16 సంవత్సరాలుగా బద్వేల్ ప్రాంతంలో తిరుమల ట్రస్ట్ బెంగళూరు వారి సహకారంతో ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రి వితరణ చేపట్టడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే తిరుమల ట్రస్ట్ వారిని స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని సేవా సంస్థల వారు ముందుకు రావాలని కోరారు. అనంతరం తిరుమల ట్రస్ట్ వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణితం ఉపాధ్యాయుడు పాలా శ్రీనివాసలు రెడ్డి, రామకృష్ణంరాజు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, శివప్రసాద్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల ఉద్యోగుల జీతాలు పెంపు హర్షనీయం

**కడప కార్పొరేషన్ జూన్ 3 ప్రభాతవార్త:**



గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న 1,659 మంది ఔట్ సోర్సింగ్ టీచర్లకు ప్రభుత్వం భారీగా జీతాలు పెంచుతూ వివో విడుదల చేయడం పట్ల బీజేపీ గిరిజన నాయకులు డాక్టర్. ఐ. శివా నాయక్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం కడపలో ఆయన మాట్లాడుతూ జెవెల్ ల్లకు ప్రస్తుతం రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకూ వేతనం వస్తుండగా.. రూ.31,250 నుంచి రూ.65వేల వరకు పెంచారనారు. 18 మంది పీజీటీలకు రూ.25వేల నుంచి రూ.31,250కి పెంచారని తెలిపారు. ఎస్ ఓ ఈ/ఎస్ సి ఓ ఈ ల ఉద్యోగులకు రూ.49 వేల నుంచి రూ.61,250 పెంచినట్లు చెప్పారు. అసిస్టెంట్ కోచ్ లకు రూ.22 వేల నుంచి రూ.27,500కు వేతనం పెంచారు.. ఇలా పెంచడం వలన చాలా మంది గిరిజన గురుకులాలో పని చేసే ఉద్యోగుల కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఇందుకు ప్రభుత్వానికి బీజేపీ నాయకులు డాక్టర్. ఐ. శివా నాయక్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గిరిజన విద్యార్థులకు సేవలు చేయడానికి, వారికి విద్య బుద్దులు నేర్పటానికి నైపుణ్యం గల ఉపాధ్యాయులు ముందుకు రావాలని కోరారు. ఇటువంటి గిరిజన గురుకల పాఠశాలలలో గిరిజన విద్యార్థులు ప్రవేశం పొంది ఉన్నత చదువులు చదివి వారి తల్లి తండ్రులకు ప్రయోజకులుగా మారాలని దేశానికి మంచి పేరు తెచ్చేలా చదువు ఉపయోగ పడాలని ఆకాంక్షించారు.

## జీవన ప్రమాణాలు పెంపొందించే లక్ష్యంగా కూటమి



ఇంటింటా ప్రచారంలో తెదేపా నాయకులు

**పీలేరు జూలై 3 ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "సుపరి పాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా పీలేరు టౌన్ జోన్ 1 యల్లమంద క్రాస్ లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి ఆ ప్రాంతంలో ఉన్న అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. అంతేకాకుండా సంపద సృష్టించి పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి, మెరుగైన జీవన విధానాలను పెంపొందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ క్రమంలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ పీలేరు డిపో గౌరవ అధ్యక్షులు, జోన్ 1 కన్వీనర్ కొత్తపల్లి శ్రీనాధ రెడ్డి, జోన్ 1 కో కన్వీనర్ గుర్రం నరేష్, రామ్ కుమార్ రెడ్డి, యూనిట్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకులు జయచంద్రా రెడ్డి, షామియానా (జయన్న) ప్రముఖ నాయకుడు పోలిశెట్టి సురేంద్ర, బూత్ కన్వీనర్ రెడ్డిముని, అబ్బవరం సురేష్, హనీఫ్,, షరీఫ్, విజయ్, డైరెక్టర్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుకు తీవ్ర గాయాలు

**ముద్దనూరు, జూలై 03, ప్రభాతవార్త:**

మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి రైల్వే గేట్ వరకు రహదారికి ఇరువైపులా సైడ్ కాలువ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ తగినన్ని జాగ్రత్తలు లేకుండా పనులు ఎక్కడ పడితే అక్కడ ఎలా పడితే అక్కడ నిర్వహిస్తుండడంతో మండల ప్రజలు, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణ నుంచి బయటకు వస్తున్న తరుణంలో పోలీస్ స్టేషన్ సమీపంలో తీసిన సైడ్ కాలువ గుంతలో పడి హోంగార్డు శ్రీనివాసులు కు తీవ్రంగా గాయపడడంతో హుటాహుటిన సిఐ దస్తగిరి ప్రొద్దుటూరు లోని వైద్యశాలకు తరలించి చికిత్స అందించినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ చేపడుతున్న పనులలో తగు జాగ్రత్తలు తీసుకుని పట్టణ ప్రజలకు ఆటంకం లేకుండా అభివృద్ధి పనులను త్వరగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## దేశ వ్యాప్తసమ్మెను జయప్రదం చేయండి

**రాజంపేట, జూలై 3 ప్రభాతవార్త**

ఈ నెల9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత సమ్మెను విజయవంతం చేయాలనిఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి చంద్ర జిల్లా కార్యదర్శి సికిందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాల పైన కేంద్రం అవలంబిస్తున్న ఆర్థిక విధానాల్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మిక సంఘాలుగా భవన నిర్మాణ ఆటో సివిల్ సప్లై సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీగా తీవ్రంగా ఖండిస్తున్నామని పెరిగినటువంటి ధరలను తగ్గించాలని విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి భవన నిర్మాణ కార్మికులు నాయకులు నరసింహ, సుబ్రహ్మణ్యం, జయరామయ్య, భీమయ్య, మల్లికార్జున, శ్రీరాములు భాష, గోవిందు, కే .రామయ్య తదితరులు పాల్గొన్నారు




**పాస్‌పోర్టు పోయినది**

వల్లపు వీరాంజనేయులు తండ్రి వల్లపు వెంకటయ్య డి. నెం. 30/3052, చలమారెడ్డి పల్లి గ్రామం, ఉక్కాయిపల్లి పోస్ట్, వైయస్సార్ కడప జిల్లా, ఏపీ. నా పాస్పోర్ట్ నెంబర్ సి0317951 పోయినది పై అడ్రస్‌కు తెలపగలరు.

**SURNAME CHANGE**

I Gajjala Harshavardhan Reddy (Aadhar No. xxxx xxxx 9629), S/o G.Nadipi Ankal Reddy D.No. 5-4-194 Peddarangapuram (vi& po), pulivendula , pulivendula mandal, YSR Kadapa Dist., AP- 516390 hereby I state that in my SSC certificate and other my certificates mentioned my father name as Gajjala ankal reddy , but actual his name is Gajjala nadipi Ankal reddy (xxxx xxxx 4264) as per his voter id, Aadhaar and land documents etc.. He reby I declared that the both names and G.Ankal Reddy and G.Nadipi ankal reddy are one person.

**NAME CHANGE**

I Gajjala Harshavardhan Reddy (Aadhar No. xxxx xxxx 9629), S/o G.Nadipi Ankal Reddy D.No. 5-4-194 Peddarangapuram (vi& po), pulivendula , pulivendula mandal, YSR Kadapa Dist., AP- 516390 hereby I state that in my SSC certificate and other my certificates mentioned my mother name as Gajjala Kesamma , but actual her name is Gajjala Venkatakesamma (xxxx xxxx 4897) as per her voter id, Aadhaar and land documents etc..Here by I declared that the both names and G.Kesamma (old name) and G.Venkatakesamma (new name)are one person.

# అన్నమయ్య ప్రాజెక్టు వద్ద కాంగ్రెస్ నేతల నిరసన

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ వెంటనే చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గాజుల భాస్కర్, నియోజకవర్గ ఇన్చార్జ్ పూల భాస్కర్ గురువారం కొట్టుకుపోయిన ప్రాజెక్టు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అన్నమయ్య ప్రాజెక్టును సందర్శించి వైసిపి నాయకులపై దుమ్మెత్తి పోసిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ అన్నమయ్య ప్రాజెక్టు గురించి ఏమాత్రం పట్టించుకోకవడం దారుణమని తీవ్ర స్వరంతో ఘాటైన విమర్శలు చేశారు. ప్రాజెక్టు కొట్టుకుపోయిన సమయంలో 40 మంది ప్రాణాలు నీటిలో కలిసిపోయాయని అదేవిధంగా వందలాది పశువులు కొట్టుకుపోవడంతో పాటు ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో నివసిస్తున్న పులపుత్తూరు, బగ్గిడిపల్లి, తొగురుపేట, మందపల్లి శేషమాంబపురం, గుండ్లూరు గ్రామాల్లో ప్రాణ నష్టం పశునష్టంతో పాటు నివసిస్తున్న రైతుల పంట పొలాలు ఇసుకమేటలు వేశాయని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టును పునర్ నిర్మించడంతోపాటు మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ప్రభుత్వమే వారికి ఇల్లు నిర్మించి ఇచ్చి అన్ని విధాల ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇ అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల సమస్యల పై ఒక ప్రత్యేక నివేదిక ను రాహుల్



గాంధీ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగే వరకూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను నిద్ర పోనివ్వకుండా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి చీఫ్ సెక్రెటరీ అమీర్ భాష, సేవాదల్ అధ్యక్షుడు అమీర్ భాష, డిసిసి వైస్ ప్రెసిడెంట్ గిరిబాబు, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, డిసిసి జనరల్ సెక్రెటరీ సయ్యద్ మస్తాన్, రియాజ్, సుండుపల్లి మండల అధ్యక్షుడు సల్మాన్, రాజంపేట మండలాధ్యక్షుడు మహదేవ య,ఒంటిమిట్ట మండలాధ్యక్షుడు గంట గురవయ్య, సుండుపల్లి మైనారిటీ మాబా, ఇర్ఫాన్, ఎం.ఈర్షద్ అలీ, చాన్ బాషా, సేవాదల్ విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మొహరం వేడుకలు



రామసముద్రం జులై 3 ప్రభాతవార్త

మండలం లోని తిరుమలరెడ్డిపల్లె, దిగువపేట, ఎగువపేట, నడింపల్లె గ్రామాల్లో ఏడ వరోజు గురువారం హస్సేన్, హుస్సేన్ ప్రత్యేక సదివింపులు చేసి భక్తి శ్రద్ధలతో మొహరం వేడుకలు జరుపుకున్నారు.పీర్ల చావడిని పచ్చని తోరణాలు విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.రాత్రి గంధపు ఫీర్ల కు బాబయ్యలకు మట్టి కుండలో పానకం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.మండల కేంద్రంలోను మొహరం జరిగే గ్రామాల్లో ఫీర్లకు బాబయ్య లకు షేరాలు కట్టి భక్తులు చెక్కర, బెల్లం బొరుగులు సదివింపులు చేసి, రాత్రి గ్రామాల్లో ఫీర్ల ఊరేగింపు చేశారు. ఈవేడుకలు తిలకించడానికి మండలంలోని ప్రజలేకాకుండా ఇతర జిల్లాలే కాక కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సికిల్ సెల్ అనీమియా పక్షోత్సవాలు



కలికిరి జులై 3 ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని ఎస్.టి. కాలనీలో మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా పక్షోత్సవాలు నిర్వహించడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి వారి ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మరియు టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డిలు సికెల్ సెల్ అనీమియా పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ప్రజలకు ఏఎమ్‌సి డైరెక్టర్ శ్రీనివాస శర్మ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిహెచ్ఈఓ మహమ్మద్ రఫీ మాట్లాడుచు సికెల్ సెల్ అనీమియా రక్తపరీక్షలు ఎస్‌టికాలనీలోని 40సంవత్సరాలలోపు ప్రజలు అందరు చేయించుకోవాలన్నారు. గురువారం మండలకేంద్రంలోని పింగాని ఫ్యాక్టరీ ఏరియాలో సికిల్ సెల్ రక్తహీనతపై 2047సంవత్సరానికి సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్‌లో భాగంగా అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. సున్నా నుండి 40సంవత్సరాల లోపు గిరిజనులు పరీక్షలు చేసుకోవాలి. వ్యాధి నిర్ధారణ ఐతే హైడ్రాక్సీ యూరియా మాత్రలుతో పాటు ఫోలిక్ ఆసిడ్ మాత్రలు కూడా ఇవ్వడం జరుగుతుంది. అవసరం ఐతే రక్తం ఎక్కించాలిసి వస్తుంది. ప్రతీ సచివాలయంలో ఉన్న ఆరోగ్య కార్యకర్తల దగ్గర కిట్ అందుబాటులో ఉన్నాయని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సికిల్ సెల్ అనీమియా ప్రజల భాగస్వామ్యం తో ర్యాలీ చేయడం జరిగింది. ప్రజల చేత నినాదాలు చేస్తూ ప్లేకార్డ్స్ ప్రదర్శన చేయడం జరిగింది. మొత్తం 15మందికి సికిల్ సెల్ పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎస్‌టిఎస్ నాగిరెడ్డి, పర్యవేక్షకులు సుధాకర్, ఎమ్‌ఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎమ్‌లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

# సుపరిపాలనే చంద్రబాబు లక్ష్యం



రైల్వే కోడూరు రూరల్, జూలై 3 ప్రభాతవార్త

కూటమి ఏర్పడినప్పటి నుండి శ్రీకారం చుట్టిన నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నమయ్య జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్ అన్నారు. గురువారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట యానాదిపల్లి జ్యోతి కాలనీ గ్రామాలలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోడూరు ఇంచార్జ్ రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుపరిపాలనకు తొలి అడుగు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో ప్రతి ఇంటికి తెలుసుకోవడానికి ఇదొక చక్కటి కార్యక్రమన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమం విప్లవాత్మకంగా జరుగుతున్నదని పథకాలు అందని ప్రజలకు ఇదొక సువర్ణ అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో మంగంపేట నాయకులు తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగరాజు రవికుమార్ రాజు, పందేటి వెంకటరామరాజు, ఎర్రగుండ్ల నీలకంఠయ్య, కొమ్మ శివ, డి కృష్ణంరాజు, సూరపురా సుబ్బరాజు, ఉప్పరపల్లి పరుశురాంరెడ్డి ముని పెంచల్‌రెడ్డి, దుద్యాల అనిత దీప్తి, మోలా, ఆకేపాటి సుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనను అందిస్తున్న కూటమి ప్రభుత్వం



ప్రొద్దుటూరు అర్బన్, జూలై 3 ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధిలోని 33వ వార్డులో ప్రొద్దుటూరు శాసనసభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి ఆదేశాల మేరకు టిడిపి కౌన్సిలర్ గాజుల శివ జ్యోతి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం అయిన సందర్భంగా గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవ రెడ్డి,భార్గవ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్ రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పాల్గొని వార్డులోని వినాయక నగర్,ఆర్ట్స్ కాలేజీ,రోడ్డులోని పలు వీధులలో ప్రజలను తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల అభిప్రాయాలను అడుగుతూ ప్రజలు చెప్పిన పలు సమస్యలు సావధానంగా వింటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు తప్పక కృషి చేస్తామన్నారు. రాఘవరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలనను అందిస్తూ ఇంకా ఏమైనా ప్రజలకు కావలసిన అవసరాలు సమస్యలు ఉంటే తెలుసుకొని వాటిని తక్షణం పరిష్కరించేందుకు ముందు ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి,కొత్తపల్లి సర్పంచ్ శివచంద్రారెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు యువ నాయకులు బచ్చల వీర ప్రతాప్, చౌటపల్లి లక్ష్మిరెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్ రెడ్డి, జిలాన్, మునీర్, కంకర్ గౌస్,, షేక్ నూరి, కమల్ భాష, పోస వరలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జేబీబుల్లా మాజీ కౌన్సిలర్లు తలారి పుల్లయ్య, వద్ది బాలుడు, తాటి శీను, గంజికుంట ఆంజనేయులు చింతకుంట కుతుబుద్దీన్, పట్టణంలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుద్ధుని విగ్రహ ధ్వంసంలో చర్యలు తీసుకోండి



నిరసన తెలుపుతున్న దృశ్యం

మదనపల్లె, జులై 3 ప్రభాతవార్త :

బుద్ధుని విగ్రహం ధ్వంసంలో కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ హెచ్చరించారు. గురువారం గౌతమబుద్ధిని విగ్రహ ధ్వంసాన్ని నిరసిస్తూ బెంగుళూరు రోడ్డులోని న్యూ అంబేద్కర్ సర్కిల్ వద్ద బాస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ బుద్ధుని తల నరికినోళ్ళ తలలు కూడా నరకే శక్తి తమకు కూడా ఉందని అయితే తాము అహింసను కోరుకునే వారము కనుక చట్టబద్ధమైన పరిష్కారం కొరకు పోలీసులపై ఆధారపడ్డామని, పోలీసులు నిర్లక్ష్యం చేస్తే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. బుద్ధుని కొండను మానవ వికాస కేంద్రంగా, గొప్ప ఆద్యాత్మిక చైతన్య కేంద్రంగా రూపొందించాలన్న ఉన్నతాశయంతో బుద్ధ అంబేద్కర్ సమాజట్రస్ట్ ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి బుద్ధిని కొండలో నిర్మాణాలు చేస్తుంటే ఉన్నాదులు ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ పక్కిలో బుద్ధిని విగ్రహాన్ని ధ్వంసం చేసి తలను నరికి కాళ్ళవద్ద పెట్టి అమానుషంగా ప్రవర్తించారని తెలిపారు. ఈ విషయంపై తాలూకా సిఐకి విన్నవించినా ఇంతవరకు స్పందించలేదన్నారు. అనుమానితులను విచారిస్తే ధ్వంసం ఘటన బయట పడుతుందన్నారు. ప్రభుత్వం కూడా ఈ ఘటనపై స్పందించాలన్నారు. ఈ నిరసన దీక్ష కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు టి.క్రిష్ణప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెవి.రమణ, ముత్యాలమోహన్, నీరుగట్టురమణ, చాట్ల బయన్న, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను తనిఖీ



యర్రగుంట్ల జులై 3 ప్రభాత వార్త

యర్రగుంట్ల పట్టణ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం డిప్యూటీ విద్యాశాఖ అధికారి మీనాక్షి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామానుజన్ రెడ్డి, మండల విద్యాధికారి శివప్రసాదులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాపరంగా అందిస్తున్న పథకాలు విద్యార్థులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే విద్యా సంవత్సరం ప్రారంభం కానీ ప్రభుత్వం నుంచి వచ్చే విద్యా సామాగ్రి విద్యార్థులకు అందుతున్నాయో లేదా పంపిణీ చేశారా లేదా అనే దానిపై అడిగి తెలుసుకున్నారు అలాగే . పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ పై కూడా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు.

# బ్యాంకు అప్పులను సక్రమంగా చెల్లించాలి

రైల్వేకోడూరు రూరల్, జూలై 3 ప్రభాతవార్త

మండలంలోని డ్వాక్రా గ్రూపుల్లో మహిళలు తీసుకున్న అప్పులను సక్రమంగా చెల్లించి గ్రూపులను అభివృద్ధి పథంలో పైనించాలని రైల్వే కోడూరు వెలుగు ఏపిఎం వసుంధర పేర్కొన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పొదుపులో ఉన్న మహిళలు తీసుకున్న అప్పులను తిరిగి బ్యాంకులకు సక్రమంగా చెల్లించి అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. ముఖ్యంగా వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది బాధ్యతగా పని చేయాలని విధులు పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖా పరమైన చర్యలు ఉంటాయన్నారు. ఇప్పటికే ఎన్నో మార్లు సంబంధిత సిబ్బందికి తెలియజేశామని విధులలో నిర్లక్ష్యం చేస్తే ఒప్పుకొని ప్రసక్తే లేదని అదేవిధంగా అక్రమాలు అవినీతి పనులు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి డ్వాక్రా మహిళ బాధ్యతగా పొదుపు నగదును సద్వినియోగం చేసుకొని కుటుంబ పోషణ సాగించాలని ఆమె సూచించారు. బ్యాంకులలో ఇచ్చే రుణాలను పూర్తిస్థాయిలో చెల్లించాలని అప్పుడే బ్యాంకులు కూడా డ్వాక్రా మహిళలకు చేయూతనిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం



ఒంటిమిట్ట జూన్ 03( ప్రభాతవార్త)

సుపరిపాలనకు తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట గ్రామంలో టిడిపి నాయకులు ప్రభుత్వము ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేసేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మరియు రాజంపేట టిడిపి సీనియర్ నాయకుడు మేడ. విజయ శేఖర్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలలతో స్వాగతం పలకడం జరిగింది. ఆయన పర్యవేక్షణలో కార్యకర్తలు ఒంటిమిట్ట గ్రామంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సుపరిపాలన సంక్షేమ పథకాల ప్రచారంపై గడపగడపకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గ్రామ పర్యటనలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ సుఖంగా వర్ధిల్లుతుందని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు తల్లికి వందనం పేరుతో ప్రభుత్వము బహుమతిగా ఇస్తున్న 13వేల రూపాయలు ఎంతో ఊరటనిస్తుందని గ్రామంలోని మహిళలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మోదుగల .పెంచలయ్య, కొమర. వెంకట నరసయ్య, బాలిశెట్టి హరిప్రసాద్, కూటమి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిత్యం పూజలందుకొంటున్న అక్కదేవతలు

నిమ్మనపల్లె, జులై 3 ప్రభాతవార్త :

మదనపల్లె-నిమ్మనపల్లె మార్గాన వెలసిన అక్కదేవతలు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా నిత్యం పూజలు అందుకుంటున్నారు. మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలో అక్కగార్ల కుంట కలదు. అక్కడ అక్కదేవతలు వెలిశారు. ఈ అక్కదేవతలు పక్కనే అభయ ఆంజనేయస్వామి కొలువు తీరాడు. దీంతో మదనపల్లె పట్టణ వాసులతో పాటు నిమ్మనపల్లె మండల వాసులు కూడా భక్తులు తరలి వచ్చి పూజలుచేస్తుంటారు. ఈ ఆలయ ఆవరణంలో 15 అడుగుల ఎత్తైన నాగదేవల పుట్ట, పంచముఖ ఆంజనేయుడు, నవగ్రహాలు, నాగదేవతలు, సీతారామ,లక్షణుల విగ్రహాలు, కళకళలాడే కోనేరు అందులో తామరపువ్వులు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంటాయి. ఇంకా దేవ గన్నేరు చెట్టు, బలపత్రా కులచెట్లు, కలదు. తడి బట్టలతో ప్రతి సోమవారం, శుక్రవారం పూజలు చేస్తే అక్కదేవతలు కోరిన కొర్కెలు భక్తులకు అనుగ్రహిస్తారని మహిళలు వరపడుతుంటారు. పిల్లలు కలగని వారు ఇక్కడ అధికంగా ముడుపులు, వరపడడం వంటివి చేస్తారు. అతి పురాతనమైన ఆలయం కావడంతో ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడం విశేషం. ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన మామిడి తోటలో అక్కగార్లు ఆలయం కలదు. ముఖ్యంగా సోమ, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు.

# సామాన్య ప్రజలకు శాస్త్ర విజ్ఞాన ఫలితాలను అందించండి




మైదుకూరు, జులై 03, ప్రభాతవార్త:

జన విజ్ఞాన వేదిక కడప రోడ్డు 18వ మహాసభ స్థానిక మెగా డిఫెన్స్ అకాడమిలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా జె వి వి అధ్యక్షులు డాక్టర్ బి.ఎల్ పార్వతి అధ్యక్షతన వహించారు. ఈ సమావేశానికి జాతీయ జె వి వి సలహా మండలి నాయకులు మహమ్మద్ మియా ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. సామాన్య ప్రజలకు శాస్త్ర విజ్ఞాన ఫలితాలను అందించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రతి ఒక్క జె వి వి కార్యకర్త నాయకులు కృషి చేయనున్నారు. రాబోవు రెండు సంవత్సరాలకు 2025, 2027 కాలానికి కడప జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జె వి వి కార్యకర్త నాయకులు ఏ.వి రమణయ్య, రామకృష్ణారెడ్డి, శివప్రసాద్ రెడ్డి, సాంబశివరావు, కర్నూలు జిల్లాకు చెందిన జె వి వి నాయకులు, మంజూరు భాష, ధనుంజయ, వీరేష్, పాల్గొన్నారు నూతన కమిటీ అధ్యక్షులుగా రామ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్వర్ రెడ్డి, సమావేశం ఎన్నుకొన్నది. జెవి వి కార్యకర్తలు, కాలేజీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి



బద్వేల్ జూలై 3 ప్రభాతవార్త

మండలం రాజుపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య పరిధిలోని రాజుపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలను తొట్టిగారిపల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొని, రాష్ట్రీయ బాలుర సురక్ష కార్యక్రమం కింద ప్రతి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఆరోగ్యం అలవాట్లను గురించి పోషకాహారం గురించి వ్యక్తిగత పరిశుభ్రత గురించి చేతుల శుభ్రతను గురించి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొని ప్రతి విద్యార్థులకు బరువు, ఎత్తు, రక్తపరీక్షలు నిర్వహించడమైనది. అనంతరం హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ సందర్భంగా లార్వాపై ఇంటింటి సర్వే చేసి లార్వా ఉన్నచోట అబౌట్ చల్లడం జరిగింది. జ్వరాలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నివారణ కోసము ప్రతి ఒక్కరూ మూడు వారాల జ్వరము, దగ్గు, గళ్ళలో రక్త చారలు ఉన్నట్లయితే వెంటనే గళ్ళ పరీక్ష ఎక్రే పరీక్షలు చేపించుకొని క్షయ వ్యాధి నివారణకు తోడ్పడుతారని హెల్త్ సూపర్వైజర్ ప్రసాద్ పేర్కొనడమైనది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య కె. వెంకటమ్మ హెల్త్ సూపర్వైజర్ హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు, సూపర్వైజర్ నరసింహప్రసాద్, సిహెచ్ఓ రాధా, హెడ్మాస్టర్ ఎల్లారెడ్డి, విజయ్ కుమారులు పాల్గొన్నారు.

# జయరామరెడ్డి భౌతిక కాయానికి నివాళు

బద్వేలు, జులై 3, ప్రభాతవార్త

సర్వాయ పల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గుంత జయరామిరెడ్డి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి రితేష్ రెడ్డి గురువారం బి కోడూరు మండలం గుంతపల్లి గ్రామానికి వెళ్ళి గుంత జయరామిరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ కుటుంబాన్ని కూటమీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# అనధికారికంగా నిర్మించిన నిర్మాణాలు చల్లవు

ఎర్రగుంట్ల జులై 3 ప్రభాతవార్త



కడప ముద్దనూరు వయా ఎర్రగుంట్ల మీదుగా నేషనల్ హైవే రోడ్డు కు సంబంధించి నేషనల్ హైవే అసిస్టెంట్ ఇంజనీర్ విశ్వనాథ్ యర్రగుంట్ల తాహసిల్దార్ శోభన్ బాబును కలిశారు ఈ ముద్దనూరు నుంచి కడప వరకు సుమారు 380 ఎకరాలు భూమి నేషనల్ హైవేకి పోతుంది ఇందులో 195 ఎకరాలు భూమి కేవలం ఎర్రగుంట్ల మండలంలోని ఉంది. ఇప్పటికే నేషనల్ హైవే పనులకు సంబంధించి భూ కేటాయింపు పరిధిలో పెగ్ మార్కింగ్ అధికారులు వేశారు. ఈ పిగ్ మార్కింగ్ పరిధిలో కొందరు అక్రమంగా అనధికారికంగా నిర్మాణం చేపట్టారని అది చెల్లవని ఏఈ విశ్వనాథ్ తెలియజేశారు. ప్రభుత్వ క వ్యతిరేకంగా పెగ్ మార్కింగ్ వేసే చోటు అనధికారకంగా నిర్మాణ పనులు నిర్మిస్తే వాటికి నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వదన్నారు అంతేకాకుండా అనధికారికంగా నిర్మాణ పనులు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఇలా అధిక నష్టపరిహారం కోసం పిగ్ మార్కింగ్ వేసిన చోట నిర్మాణ పనులు చేపడితే ప్రాజెక్టు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు ఇప్పటికైనా ప్రజలు గమనించి నేషనల్ హైవే నిర్మాణ పనులకు అడ్డంకులు లేకుండా చూడాలని వారు కోరారు.

# ఇంగ్లీషు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

పెనగలూరు జూలై 3 ప్రభాతవార్త

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు సబ్జెక్టు బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్ కు అర్హులైన నిరుద్యోగుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి శ్రీనివాసల రెడ్డి తెలిపారు. ఎం ఏ ఇంగ్లీషు సబ్జెక్టులో 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు తమ విద్యార్హతలతో పాటు అనుభవ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను దరఖాస్తుతో పాటు పోస్టు ద్వారా గాని నేరుగా గాని ఈనెల 7 వ తేదీలోగా అందజేయాలని తెలిపారు 8వ తేదీన కళాశాలలో డెమో క్లాసు కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎంపిక ప్రక్రియ కార్యక్రమం ఈ సందర్భంగా తెలిపారు.

# కుటుంబసభ్యులను ఓదార్చిన విజయజ్యోతి

కాశినాయన జూలై 3 ప్రభాతవార్త

బద్వేల్ నియోజకవర్గం కాశి నాయన మండలం గొంటువారిపల్లెలోని సాయంకాలం పేపర్ బద్వేల్ తాలూకా ఇన్చార్జ్ అయినా బసిరెడ్డి నరసింహారెడ్డి త ల్లి మృతి చెందడంతో ఆమెకు నివాళి అర్పించి అనంతరం నరసింహారెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను ఎన్ డి విజయ జ్యోతి ఓదార్చరు ఈ కార్యక్రమంలో కాశినాయన మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరు భాష, రఫీ, అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎడ్యుకేషన్ జూలై 3 ప్రభాతవార్త :

కడప నగరంలోని శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కడప జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రోగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ కడప నగరంలో కార్పొరేట్ శ్రీ చైతన్య విద్యా సంస్థలు 14 బ్రాంచ్లు ఉన్నాయని అనేక బ్రాంచులకు క్రీడా మైదానాలు కానీ పార్కింగ్ ప్లేస్ లేవన్నారు బస్ ఫీజు , యూనిఫామ్ ఫీజు, డెవలప్మెంట్ ఫీజు, బుక్స్ ఫీజు నా పేరుతో విద్యను వ్యాపారం చేస్తూ ఉన్నారు .విద్యా హక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను నిలువుదోపిడీలకు పాల్పడుతున్నారు అన్నారు.విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఆర్.టి.ఈ విద్యాహక్కు చట్టం ప్రకారం పేద బడుగు బలహీన వర్గం విద్యార్థులకు చెందవలసిన 25 ఉచిత సీట్లు కూడా కేటాయించలేదన్నారు. విద్యాసంస్థలపై చర్యలు తీసుకోలేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యార్థి యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాల చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా హిమాం కాశీం పీర్ల మెరవణి

చిన్నమండెం జూలై 3 ప్రభాతవార్త:



మండల కేంద్రంలో జరుగుతున్న మొహరం వేడుకల్లో భాగంగా గురువారం పాత స్టేట్ బ్యాంక్,పీర్ల మకాన్ లోని హిమాం కాశీం పీర్లను సంతబజార్ వరకు ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.ఈ సందర్భంగా సన్నాయి మేళం,డప్పు వాయిద్యాలు, బాణాసంచాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. షరబత్‌ను సదివింపులు చేసి అందరికీ పంచి పెట్టారు. పీర్ల మకాన్ లో సంతానం కొరకు ముడుపులు కట్టారు. అడ్నిగుండాలు ఏర్పాటు చేసారు. 5 వ తేదీ బాసికం మెరవణి అత్యంత వైభవంగా జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

# అతిధి అధ్యాపకుల దరఖాస్తుల ఆహ్వానం.

తొండూరు జూలై 3 ప్రభాతవార్త:

స్థానిక తొండూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో అతిధి ఆధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు చేసుకొనుటకు ప్రకటన చేయడం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్ రావు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న వృక్ష శాస్త్రం అధ్యాపక పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చును. M.s.c (Botany) లో 50 మార్కులతో ఉత్తీర్ణులు అయినవారు అర్హులు. ఈనెల 5వ తేదీ లోగా కళాశాలలో తమ బయోడేటా తో పాటు విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవలెను. 07/07/2025 తేదీన ఉదయం 11 గంటలకు డెమో క్లాస్ మరియు ఇంటర్వ్యూ నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు.

# పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు జూలై 3 ప్రభాతవార్త

ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలోని పలు ప్రాంతాలలో గురువారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. వీధుల వెంట వర్షం నీరు పారింది. ఉన్నట్టుండి అకస్మాత్తుగా కురిసిన వర్షానికి పాదచారులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



# ఘనంగా పీర్ల ఊరేగింపు

ముద్దనూరు, జులై 03, ప్రభాతవార్త:



మొహరం పండుగ సందర్భంగా పట్టణంలో మొదటి రోజు పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ముస్లిం సోదరులు, ఘనంగా నిర్వహించారు. పీర్ల ఊరేగింపు కార్యక్రమంలో పట్టణ ప్రజలు పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం పీర్ల ఊరేగింపు చేపడతామని మొహరం కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం విడి దినం కార్యక్రమం నిర్వహించి, ఆదివారం ఏటికి (మక్కా) పోయే కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.

# మేఐహెల్ప్యు ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

ప్రొద్దుటూరు అర్బన్, జులై 3 ప్రభాతవార్త :



గవర్నమెంట్ హాస్పిటల్ నందు పోలక శ్యాం సుందర్ రెడ్డి అనే వ్యక్తి అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుభహాన్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి గురువారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుభహాన్, కృపా అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు పాపిశెట్టి వెంకటలక్షుమ్మ,సుమన్ బాబు, సురేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

